ఎల్వోసీ అందజేత

టోలిచౌకి అజీజ్‌బాగ్‌కు చెందిన సాదత్ జమాని అనారోగ్యం కారణంగా నిలోఫర్‌లో చికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకొన్నాడు. మంజూరైన రూ.1.50 లక్షల ఎల్వోసీని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ సోమవారం లబ్ధిదారు కుటుంబ సభ్యులకు అందించారు.

- మెహిదీపట్నం

అంకితభావంతో.. సేవలందించాలి

వైద్యసిబ్బంది అంకితభావంతో సేవలందించాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ సలహాదారులు సైదమ్మ అన్నారు. సోమవారం కింగ్‌కోఠి జిల్లా దవాఖాన ఆవరణలో యూనియన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆమె యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నారాయణ, రాజేందర్, నర్సింగ్ ఆఫీసర్ బ్రాంచ్ అధ్యక్షురాలు ఎం. సుజాత, కోశాధికారి జి. సునీత, ఉపాధ్యక్షురాలు వై. శోభారాణి, సలహాదారులు జయలీల పాల్గొన్నారు.

- సుల్తాన్‌బజార్

భక్తిశ్రద్ధలతో బక్రీద్

అబిడ్స్ : బక్రీద్ సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

అంబర్‌పేట మున్సిపల్ మైదానంలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఎన్టీఆర్ స్టేడియానికి వందలాది మంది హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు. – కావాడిగూడ

అబిడ్స్, జూన్ 17: బక్రీద్‌ను ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. పలు ప్రాంతాలలో జరిగిన ప్రార్థనలలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ వహీద్ అహ్మద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

అంబర్‌పేట / గోల్నాక : బక్రీద్‌ను సోమవారం అంబర్‌పేట నియోజకవర్గంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నియోజకవర్గంలో అన్ని డివిజన్లలో ఉన్న ముస్లింలు ఒకొరికొకరు శుభాకాంక్షలు తెలుసుకున్నారు. అంబర్‌పేట మున్సిపల్ మైదానంలో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనల అనంతరం శ్రీరమణ చౌరస్తా ఖాద్రిబాగ్ వద్ద గల సమాధుల వద్దకు వచ్చి వారి పెద్దలకు పూలు సమర్పించి నివాళులర్పించారు. అంబర్‌పేట మాజీ కార్పొరేటర్ పులి జగన్ మున్సిపల్ మైదానానికి వెళ్లి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కొందరు ముస్లిం యువకులు అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్ అశోక్‌కు బక్రీద్ తెలిపారు.

మెహిదీపట్నం 7: త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్‌ను ముస్లింలు సోమవారం భక్తి, శ్రద్ధలతో జరుపుకున్నారు. కార్వాన్, నాంపల్లి నియోజకవర్గాలలోని ఈద్గా మైదానాలలో జరిగిన సామూహిక ప్రార్థనలలో వేలాది మంది ముస్లింలు పాల్గొన్నారు. టోలిచౌకిలో జరిగిన ప్రార్థనలలో కార్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్, నాంపల్లి అహ్మద్‌నగర్ ఫస్ట్‌లాన్సర్‌లో జరిగిన ప్రార్థనలలో నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్‌మాజీద్ హుస్సేన్ పాల్గొని ప్రార్థనలను చేసి అనంతరం ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా దక్షిణ, పశ్చిమ మండలం డీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో ఆసిఫ్‌నగర్, గోల్కొండ, కుల్సంపురా డివిజన్ల ఏసీపీలు కిషన్, సయ్యద్ ఫయాజ్, మునావర్‌ల ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాలలో పోలీస్ బందోబస్తును పటిష్టంగా నిర్వహించారు.

వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ వహీద్ అహ్మద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

శుభాకాంక్షలు తెలుపుతున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్

ప్రార్థనల అనంతరం చిన్నారులతో ఎంఐఎం నాయకుడు మహ్మద్ షబ్బీర్ ఖాన్

శుభాకాంక్షలు

ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో బక్రీద్‌ను జరుపుకున్నారు. టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీని ఆయన నివాసంలో టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్ కలుసుకొని శాలువాతో సన్మానించి, బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యక్షుడు కురాడి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి వైదిక్ శస్త్ర, కార్యవర్గ సభ్యుడు బి. శంకర్, శ్రీధర్‌నాయుడు, సలహాదారులు బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఏపీఆర్‌వో మహ్మద్ వహీద్, ఇతర శాఖల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

- సుల్తాన్‌బజార్

మహబూబ్ అలంఖాన్ ఇంటికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి

కాచిగూడ, జూన్ 17: బక్రీదు పండుగను పురస్కరించుకొని అంబర్‌పేట నియోజకవర్గం బర్కత్‌పురలోని గోల్కొండ సిగరేట్ ఫ్యాక్టరీ యజమాని మహబూబ్ అలంఖాన్ ఇంటికి సోమవారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి వచ్చారు. ఆలంఖాన్ కుటుంబ సభ్యులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. వారితో కలిసి విందు భోజనం చేశారు.



బక్రీద్ సందర్భంగా కార్వాన్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉస్మాన్‌బిన్ మహ్మద్ ఆల్ హజరీకి పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కార్వాన్ కాంగ్రెస్ నాయకులు తూముకుంట అరుణ్‌కుమార్, శ్రీనివాస్, బిజ్జ దుర్గా ప్రసాద్, జగన్ గౌడ్, దర్శన్ కుమార్, ఆదర్శ్ మౌర్య, సంతోష్ గౌడ్, తిరుపతి తదితరులు ఉస్మాన్‌బిన్ నివాసానికి వెళ్లి ఈద్ ముబారక్ చెప్పారు.

- అబిడ్స్

విద్యార్థులకు ప్రశంసా పత్రాల ప్రదానం

చిక్కడపల్లి, జూన్ 17 : రుద్రమదేవి షోటోకాన్ కరాటే సెల్ఫ్ డిఫెన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ కోచింగ్ క్యాంప్ ముగింపు వేడుకలు సోమవారం గాంధీనగర్ టీఆర్‌టీ గ్రౌండ్స్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్ శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కరాటే మాస్టర్ నారాయణ, ఎస్‌కేడీఏ ఇండియా చీఫ్ ఎగ్జామినర్ క్యోషి, డాక్టర్ రవి , ఫౌండర్ షిహాన్, ఎన్.లక్ష్మి, బసవరాజు, నర్సింగ్, వెంకట్ పాల్గొన్నారు.

చెత్త వేస్తే జరిమానా తప్పదు

అంబర్‌పేట, జూన్ 17: నల్లకుంట డివిజన్ రైల్వేబ్రిడ్జి వద్ద చెత్త వేస్తే జరిమానా తప్పదని కార్పొరేటర్ వై.అమృత హెచ్చరించారు. డంపింగ్ పాయింట్‌గా మారిన ఆ స్థలంలో చెత్త వేయకుండా చర్యలు తీసుకున్నారు. సోమవారం ఆమె డివిజన్ నాయకులు కె.జె.బాబు, ఎం.బి. కిశోర్‌లతో కలిసి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ఇటీవల ఇక్కడ చెత్త వేయొద్దని ఏర్పాటు చేసిన బ్యానర్‌ను ఎవరో తొలగించారు. దీంతో శాశ్వతంగా బోర్డును ఏర్పాటు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

సేవా భావంతో పనిచేసినప్పుడే గుర్తింపు లభిస్తుందని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సి. వినోద్‌యాదవ్ అన్నారు. చిట్టబోయిన ఫౌండేషన్ చైర్మన్ వినోద్‌యాదవ్ ఆధ్వర్యంలో చిట్టబోయిన బాలమణియాదవ్ వర్ధంతి సందర్భంగా సోమవారం చెప్పల్‌బజార్‌లో ఉచితంగా నోట్‌బుక్స్, చీరలు, పండ్లు పంపిణీ చేసి, అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నంద కిశోర్‌యాదవ్ పాల్గొన్నారు.

- కాచిగూడ

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

అంబర్‌పేట, జూన్ 17 : ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ కన్సల్టెంట్ పిజీషియన్ డాక్టర్ హరిచరణ్ అన్నారు. సీజన్స్ హాస్పిటల్స్ అండ్ పీపుల్స్ హెల్త్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బాగ్‌అంబర్‌పేట సీజన్స్ హాస్పిటల్స్ ఆవరణలో ఉచిత ఫేస్ స్కాన్ టెస్ట్‌ను నిర్వహించారు. దీన్ని ఆయన ప్రారంభించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీజన్స్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ దేవేందర్‌రెడ్డి, బీజేపీ నాయకులు పి.గోవర్ధన్‌రెడ్డి, డా.పుట్టపాండురంగయ్య, ప్రవీణ్‌యాదవ్, రాంరెడ్డి, మల్లారెడ్డి, సునంద, బీఆర్ఎస్ నాయకులు మిర్యాల రవీందర్, గణేశ్ పాల్గొన్నారు.

భక్తితత్వాన్ని పెంపొందించే గ్రంథాలు అందించాలి

రామాచార్యులు రచించిన గ్రంథావిష్కరిస్తున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి రమణాచారి, కసిరెడ్డి వెంకటరెడ్డి, వెనిగళ్ల రాంబాబు

తెలుగు యూనివర్సిటీ, జూన్ 17 : భక్తి తత్వంతో కూడిన గ్రంథాలు నేటి తరానికి అందించాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి. రమణాచారి అన్నారు. సాధన సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ బి. రామాచార్యులు రచించిన నామస్మరణం – మోక్షదాయకం గ్రంథావిష్కరణ సభ రెడ్‌హిల్స్ నఫీజ్ రెసిడెన్సీలోని రమణాచారి కార్యాలయంలో సోమవారం జరిగింది. గ్రంథాన్ని ఆవిష్కరించిన రమణాచారి రచయిత సాహిత్య శైలిని కొనియాడారు. కార్యక్రమంలో ఓయూ విశ్రాంత ఆచార్యులు కసిరెడ్డి వెంకటరెడ్డి, సినీగేయ కవి డాక్టర్ వెనిగళ్ల రాంబాబు, సాధన అధ్యక్షుడు నరసింహాచార్య, కార్యదర్శి శంభుని కుమార్ పాల్గొన్నారు.

ప్రజలను చైతన్యం చేసే రచనలు రావాలి

ఆధ్యాత్మిక రచనలతో కవులు రచయితలు సమాజాన్ని చైతన్యం చేయాలని ఆధ్యాత్మికవేత్త, ఆదాయ పన్ను శాఖ విశ్రాంత చీఫ్ కమిషనర్ ఎం. నరసింహప్ప అన్నారు. భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం చిక్కడపల్లిలోని కళాభారతిలో కళారత్న డాక్టర్ బిక్కి కృష్ణ ఆధ్యక్షతన భువనేశ్వరి మారేపల్లి రాసిన 'మేఘ సందేశం' పుస్తకావిష్కరణ సభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నరసింహప్ప పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ధర్మన్న ఫౌండేషన్ అధ్యక్షురాలు డాక్టర్ రాధా కుసుమ, డాక్టర్ నాళేశ్వరం శంకరం, వై.ఎస్.ఆర్. శర్మ, ప్రముఖ కవులు డాక్టర్ జెల్ది ప్రభాకర్, డాక్టర్ కావూరి శ్రీనివాస్, నవీనరాణి పాల్గొన్నారు.

- చిక్కడపల్లి

నోట్‌బుక్స్ పంపిణీ

ఫాదర్స్ డే సందర్భంగా రామకృష్ణ మఠంలో యోగానంద రఘుమహారాజు, నవభారత లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లోయర్ ట్యాంక్‌బండ్‌లోని దోమలగూడ రామకృష్ణ మఠంలో బాలల సేవా విభాగంలో ఏర్పాటు చేసిన నాన్నపై డ్రాయింగ్, వ్యాసరచన పోటీల్లో రాణించిన విద్యార్థులకు సోమవారం ప్రొగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఇండియా అధ్యక్షురాలు హిప్నో పద్మా కమలాకర్, డాక్టర్ పి. స్వరూపరాణి, శోభారాణి హాజరై నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ.. నాన్నను అర్థం చేసుకుంటే అంత మంచి స్నేహితుడు ఎవరూ ఉండరన్నారు. కార్యక్రమంలో హారతి, బి. సరోజిని రామారావు, జి. కృష్ణవేణి పాల్గొన్నారు.

- కవాడిగూడ

తెలంగాణలో హిందూ వ్యతిరేక పాలన

సుల్తాన్‌బజార్, జూన్ 17 : తెలంగాణలో హిందూ వ్యతిరేక పాలన కొనసాగుతుందని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు సోమవారం విమర్శించారు. మెదక్‌లో హిందువులపై కత్తిపోట్లు, దాడులకు పాల్పడిన వారిని అరెస్టు చేయకపోవడం దుర్మార్గమన్నారు. హిందువులను మాత్రమే రిమాండ్ చేయగా న్యాయమూర్తి సైతం ఒకే వర్గాన్ని ఏ విధంగా రిమాండ్ చేస్తారని అవతలి వర్గాన్ని కూడా రిమాండ్ చేయాలని సూచించినా పోలీసుల తీరు మారడం లేదని వాపోయారు. దాడులకు పాల్పడిన వారిని అరెస్టు చేయడంలో ఐజీ రంగనాథ్, మెదక్ ఎస్‌పీ బాలస్వామి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం తగదని హెచ్చరించారు. మలక్‌పేట వద్ద గోవులను కాపాడిన యువతులను చంపేస్తామని బెదిరించిన వారిపై కూడా కేసు నమోదు చేయక పోవడం దుర్మార్గమన్నారు.

ఇద్దరు అదృశ్యం

సుల్తాన్‌బజార్ : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యమయ్యారు. సుల్తాన్‌బజార్ ఎస్ఐ కిరణ్‌కుమార్‌రెడ్డి సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. మీర్‌పేటకు చెందిన 73 ఏండ్ల చాందీ 2న కోఠిలోని మహంకాళీ టెంపుల్ వద్ద తన భర్త తులసీరాంతో కలిసి వచ్చింది. తర్వాత చాందీ కనిపించలేదు. దీంతో భర్త సుల్తాన్‌బజార్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ కిరణ్‌కుమార్‌రెడ్డి దర్యాప్తు ప్రారంభించారు.

ఉద్యోగానికి వెళ్లిన యువతి..

ఉద్యోగానికి వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన సుల్తాన్‌బజార్ పరిధిలో సోమవారం జరిగింది. ఎస్ఐ మధుసూదన్ తెలిపిన ప్రకారం.. దిల్‌సుఖ్ నగర్ పీ అండ్ టీ కాలనీ, గృహశిల్పి అపార్ట్‌మెంట్‌లో నివసించే బనావత్ పంతుల నాయక్ కుమార్తె పూజిత బీటెక్ మూడో సంవత్సరం చదువుతూ పార్ట్ టైం జాబ్ చేస్తుంది. 16 న ఉదయం 8.30 గంటలకు తండ్రి పూజితను కోఠిలోని బస్ స్టాప్ వద్ద దించాడు. కాని ఇప్పటికీ ఇంటికి తిరిగి రాలేదు. దీంతో తండ్రి సుల్తాన్‌బజార్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఆచూకీ తెలిసినవారు 8712661264 కు సమాచారం అందించాలని కోరారు.

ఆకట్టుకున్న చిత్రకళా ప్రదర్శన

తెలంగాణ భాషాసాంస్కృతిక శాఖ, పికాసో దిస్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఎండ్ లవ్ పేరుతో సోమవారం రవీంద్రభారతి లోని ప్రాంగణంలో చిత్రకళ ప్రదర్శన విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా భాషాసాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ , హైదరాబాద్ హార్ట్ సొసైటీ ప్రెసిడెంట్ రమణారెడ్డి విచ్చేసి ప్రదర్శనను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాలయం పెయింటింగ్ ఫ్యాకల్టీ మహేశ్, పికాసో సంస్థ అధ్యక్షుడు రమేశ్ పాల్గొన్నారు.

- రవీంద్రభారతి

అమృతవల్లికి అంతర్జాతీయ అవార్డు

మన సంస్కృతి సంస్థ నిర్వహించిన రాష్ట్ర స్థాయి తెలుగు ప్రతిభా పరీక్షలలో అమృతవల్లి వరుసగా ఆరుసార్లు విజేతగా నిలవడంతో పాటు పదో తరగతిలో తెలుగు సబ్జెక్టులో 99 మార్కులు సాధించినందుకు అంతర్జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేసినట్లు సంస్థ ప్రతినిధులు రామచంద్ర, పవన్ తెలిపారు. మలేషియాకు చెందిన యునైటెడ్ హెరిటేజ్ ఆర్ట్ అండ్ కల్చరల్ సంస్థ సోమవారం మలేషియా కౌలాలంపూర్‌లో జరిగిన పురస్కారాల ప్రదానోత్సవంలో అంతర్జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేసి సత్కరించింది. ఈ సందర్భంగా అమృతవల్లిని మలేషియా యూనిటీ డిప్యూటీ మినిస్టర్ సరస్వతి కందస్వామి ప్రశంసించారు.

- తెలుగు యూనివర్సిటీ

ఏసీపీని సస్పెండ్ చేయాలని ఆందోళన

కార్వాన్, జూన్ 17 : ఆసిఫ్‌నగర్ ఏసీపీని సస్పెండ్ చేయాలని బీజేపీ నాయకులు ఆందోళనకు దిగడంతో గుడిమల్కాపూర్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆదివారం రాత్రి 11 గంటల తర్వాత గుడిమల్కాపూర్ చౌరస్తాలోని దుకాణాలను ఏసీపీ కిషన్‌కుమార్ మూసి వేయిస్తున్నారు. స్థానిక వ్యాపారులు కార్వాన్ బీజేపీ ఇన్‌చార్జి అమర్‌సింగ్‌ను కలిసి పోలీసులు అమర్యాదగా మాట్లాడుతూ.. దుకాణాలు మూసి వేయిస్తున్నారని ఫిర్యాదు చేశారు. అమర్‌సింగ్ అక్కడికి చేరుకొని ఇతర ప్రాంతాల్లో తెరిచి ఉండగా ఎందుకు ఒత్తిడి చేస్తున్నారని ప్రశ్నించారు. దీంతో ఆసిఫ్‌నగర్ ఏసీపీ కిషన్‌కుమార్ కోపోద్రిక్తుడై అమర్‌సింగ్‌ను నెట్టి వేసినట్లు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు గుడిమల్కాపూర్ పీఎస్‌కు చేరుకుని ఏసీపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న సౌత్, వెస్ట్ జోన్ డీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అక్కడకు చేరుకుని ఘటన విషయాలను తెలుసుకుని అమర్‌సింగ్‌కు సర్ది చెప్పి శాంతింపచేశారు. ఈ విషయమై బీజేపీ నాయకులు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

సింహవాహిని ఆలయంలో పూజలు

అబిడ్స్, జూన్ 17: లాల్‌దర్వాజ సింహవాహిని శ్రీ మహంకాళి ఆలయంలో రాజ్యసభ సభ్యుడు మందడి అనిల్‌కుమార్‌యాదవ్ పూజలు చేశారు. ఎంపీగా ఎన్నికైన తర్వాత మొదటిసారి దర్శనానికి వచ్చిన అనిల్‌కుమార్ యాదవ్‌ను ఆలయ చైర్మన్ సి. రాజేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు స్వాగతం పలికి సన్మానించారు. ఆలయానికి రంగులు వేసే కార్యక్రమానికి ఓంకారం రాసి శ్రీకారం చేశారు. అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. లాల్‌దర్వాజ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కన్వీనర్ జి. అరవింద్‌కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులు బి. మారుతి యాదవ్, ఎ. చంద్రకుమార్, కోశాధికారి పోసాని సతీశ్‌ముదిరాజ్, ఆలయ మాజీ చైర్మన్ కె. వెంకటేశ్, సి. బంగ్లారాజుయాదవ్, కె. విష్ణుగౌడ్, సి. రాజ్‌కుమార్‌యాదవ్, సి. రాజ్‌కుమార్, సి.వెంకటేష్, జె. లక్ష్మీనారాయణగౌడ్, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు బొల్గరి కిరణ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం సాయంత్రం బాగ్‌లింగంపల్లిలో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలో ఫీజులను నియంత్రించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని మండిపడ్డారు.

- చిక్కడపల్లి

భారీ వర్షం.. రోడ్లపైకి వరదనీరు

చిక్కడపల్లి, జూన్17: సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి గాంధీనగర్ డివిజన్‌లోని పలు ప్రధాన రోడ్లు, లోతట్టు ప్రాంతాల్లో భారీగా వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్ సమీపంలోని జవహర్‌నగర్ ప్రధాన రోడ్డులో భారీ వరద నీరు చేరడంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో డీఆర్ఎఫ్ బృందాలు చేరుకుని వరద నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు.

బక్రీద్ వ్యర్థాల తరలింపు

బక్రీద్ సందర్భంగా జంతువుల వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా జీహెచ్ఎంసీ అధికారులు సోమవారం చర్యలు చేపట్టారు. వాహనాలను పెట్టి వ్యర్థాలను సేకరించి తరలించేందుకు కృషి చేశారు. సర్కిల్ – 12,13 ఏఎంఓహెచ్‌లు డాక్టర్ విజయ్ భూపతి, అనూరాధ సిబ్బందిని సమన్వయం చేస్తూ వ్యర్థాల తరలింపును పర్యవేక్షించారు.

- మెహిదీపట్నం

సామాజిక సమరసతా వేదిక అధ్యక్షుడిగా నరేశ్‌బాబు

కాచిగూడ, : సామాజిక సమరసతా వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ నరేశ్ బాబు సోమవారం బర్కత్‌పుర ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేశ్‌బాబు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో గురుతర బాధ్యతలు అప్పగించిన సామాజిక సమరసతా అఖిల భారత కన్వీనర్ శ్యాంప్రసాద్, తెలంగాణ కన్వీనర్ అప్పాల ప్రసాద్, రాష్ట్ర ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

సేవాలాల్ సేనా రాష్ట్ర కన్వీనర్‌గా సైదానాయక్

చిక్కడపల్లి : సేవాలాల్ సేనా రాష్ట్ర కన్వీనర్‌గా మాలోత్ సైదానాయక్‌ను పూర్తిస్థాయిలో నియమించినట్లు సేనా వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవ్‌నాయక్ తెలిపారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలో ఆయన మాట్లాడుతూ.. గతంలో ఉన్న త్రిసభ్య కమిటీని రద్దు చేసి పంచ సభ్యుల కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇన్‌చార్జిగా కొనసాగుతున్న సైదానాయక్‌ను కన్వీనర్‌గా నియమించినట్లు తెలిపారు. 21న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సును నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.అదే విధంగా సేవాలాల్ సేనా కన్వీనర్‌గా మాలోత్ సైదానాయక్, వ్యవస్థాపక ధర్మ జాగరణ జాతీయ అధ్యక్షుడుగా రమేశ్ మహారాజ్, వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా స్వరాజ్‌నాయక్, ఉద్యోగ సేవా రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా మూడావత్ కృష్ణనాయక్ ఏకగ్రీవంగా నియమించినట్లు తెలిపారు.